నమస్తే తెలంగాణ
నల్లగొండ, సోమవారం, 7 ఏప్రిల్ 2025
MONDAY, APRIL 7, 2025

## యువత క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి

• బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి



క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 6 : యువత క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. శ్రీరామనవమి, అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని అనంతారం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రీమియర్ లీగ్ సీజన్-1 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసంతోపాటు శరీర ధారుఢ్యం పెంపొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పలిపాటి హరిబాబు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు కుతాడి సురేశ్, వల్లపు విజయ్, నాయకులు బాలరాజుయాదవ్, శ్రీశైలం, హరీశ్, మనోహర్, నరేశ్, నిర్వాహకులు రాజలింగం, రవికుమార్, శివప్రసాద్, నరేశ్ పాల్గొన్నారు.



పంతంగిలో సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

## నిరుపేదల కోసం సన్న బియ్యం : ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 6 : నిరుపేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేపట్టిందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని పంతంగి గ్రామంలో ఆదివారం సన్న బియ్యం పథకం లబ్ధిదారుడి ఇంట్లో ఆదివారం ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో దొడ్డు బియ్యం పెట్టినప్పుడు దళారులు, రైస్ మిల్లర్లు మాత్రమే బాగుపడేవారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ నిర్ణయంతో నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు.

## యువ చైతన్య సైకిల్ యాత్రను జయప్రదం చేయాలి : డీవైఎఫ్ఐ

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 6 : ఈనెల 14 నుంచి 20 వరకు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టే యువ చైతన్య సైకిల్‌యాత్రను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దయ్యాల మల్లేశ్ పిలుపునిచ్చారు. మండలంలోని హన్మాపురంలో డ్రగ్స్ గంజాయి వద్దు 'మన ఆరోగ్యం ముద్దు ఆన్‌లైన్ బెట్టింగులు వద్దు' అనే నినాదం మీద ఆదివారం 250 కిలోమీటర్లు 55 గ్రామాలు కలుపుకొని నిర్వహించే యువ చైతన్య సైకిల్ యాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. హైదరాబాద్ మహానగరానికి కూతవేటు దూరంలో ఉన్న జిల్లాలో యథేచ్ఛగా ఆన్‌లైన్ బెట్టింగ్ సాగుతుందని, 17 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల్లోపు యువకులు వీటికి బానిసలుగా మారి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆర్భాటపు ప్రచారాలు తప్ప ఆచరణలో మాత్రం ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. జిల్లా వ్యాప్తంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏడు రోజులపాటు నిర్వహించే యువ చైతన్య సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు ప్రశాంత్, నగేశ్, సురేవ్, భాస్కర్ పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత



కొల్లూరులో ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజారాం

ఆలేరురూరల్, ఏప్రిల్ 6 : మండలంలోని కొల్లూరులో ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు వారం రోజుల నుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహించి ఆదివారంతో ప్రోగ్రాం ముగియడంతో ఆలేరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థులకు సర్టిపికేట్లను అందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి ముత్యాలు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

## డబుల్ రోడ్డు పనులను ప్రారంభించాలి : సీపీఎం



ఆత్మకూరు(ఎం)లో డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరుతూ.. సీపీఎం నాయకులు

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 6 : మండల కేంద్రంలోని మోత్కూర్- భువనగిరి ప్రధా నరోడ్డు నుంచి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకు డబుల్‌రోడ్డు నిర్మాణ పనుల కోసం జనవరి 9న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి 3 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పనులు ప్రారంభించ లేదు. డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని కోరుతూ ఆదివారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించడంతో పాటు వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు డబుల్‌రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం, జిల్లా నాయకులు రచ్చ గోవర్ధన్, గ్రామశాఖ కార్యదర్శి రాచమల్ల సత్తయ్య, తుమ్మల సత్యనారాయణరెడ్డి, కందడి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## రైతు భరోసా విడుదల చేయాలి : సీపీఎం




సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నరసింహ

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 6 : స్థానిక రైతాంగానికి రైతు భరోసా డబ్బు వెంటనే విడుదల చేయాలని, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండ మడుగు నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2024 వానకాలం, రైతు భరోసా నిధులు విడుదల చేయలేదని, యాసంగి పంట కోతకు వచ్చినా నేటికీ మండలంలోని రైతులకు రైతు భరోసా డబ్బు ఇవ్వకపోవడం దారుణమన్నారు. రైతులు అప్పు చేసి పంట పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేస్తే మూసీ జల కాలుష్యంతో అనేక రోగాలతో సరైన పంటలు పండక, పండిన పంటకు గిట్టుబాటు రాక అప్పుల బాధతో రైతులు బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, పట్టణ కమిటీ సభ్యులు వడ్డేపల్లి యాదగిరి, బుగ్గ లక్ష్మయ్య, పానమోని కృష్ణ, బేతి కమలమ్మ పాల్గొన్నారు.

# పౌర సేవలో శివారెడ్డిగూడెం ముందంజ

- అన్ని సేవలూ ఆన్‌లైన్ ద్వారానే అమలు
- జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి ఎంపిక




శివారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ భవనం

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 6 : మండలంలోని శివారెడ్డిగూడెం గ్రామపంచాయతీ ఆన్‌లైన్‌లో పౌర సేవలు అందించడంలో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచింది. ఎటుచూసినా పచ్చదనం పరవళ్లు తొక్కుతూ, వ్యవసాయం, అనుబంధ ఆధారిత ప్రాంతమైన ఈ గ్రామంలో 580 కుటుంబాలు ఉన్నాయి. 2,063 మంది జనాభా ఉన్నారు. అన్ని వర్గాల ప్రజలతో అనుబంధాలతో మెలుగుతున్న శివారెడ్డిగూడెం గ్రామపంచాయతీ అన్ని పౌర సేవలను ఆన్‌లైన్ ద్వారా అందించడంతో జిల్లాలో ఆదర్శంగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ అండ్ పబ్లిక్ గ్రీవెన్స్ (పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల అమలు) డీఏఆర్ పీజీలో ఉత్తమ ర్యాంక్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. శివారెడ్డిగూడెం గ్రామపంచాయతీ ఆన్‌లైన్ ద్వారా పౌర సేవలు అందించడంతో పౌర సేవల అమలు తీరును పరిశీలించేందుకు త్వరలో ఉన్నతాధికారుల బృందం గ్రామపంచాయతీని సందర్శించనున్నది.

### గ్రామ విశిష్టత

శివారెడ్డిగూడెం గ్రామంలో 80శాతం మంది అక్షరాస్యులు ఉన్నారు. కంప్యూటర్, డిజిటల్ పేమెంట్స్ సేవలు చెల్లించడంలో యువత ఆసక్తి చూపుతుంది. గ్రామంలో విరివిగా ట్రాక్టర్లు, వరి కోత యంత్రాలు, రసాయన ఎరువులు వెదజల్లె డ్రోన్లతో యువత ఉపాధి పొందుతున్నారు. గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు. చెత్తతో కంపోస్ట్ ఎరువు తయారు చేస్తున్నారు. గ్రామంలో నర్సరీ ఏర్పాటు చేసి ఖాళీ ప్రదేశాల్లో, రోడ్ల వెంట విరివిగా మొక్కలు నాటారు. వీధులను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందిస్తున్నారు. ఆరోగ్య ఉప కేంద్రంలో రోగులకు వైద్య చికిత్స అందించడం గమనార్హం. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి గ్రామపంచాయతీలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

### ఆన్‌లైన్ ద్వారా అన్ని సేవలు

రాష్ట్ర రాజధానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న శివారెడ్డిగూడెం గ్రామపంచాయతీలో జననం, మరణ ధ్రువీకరణ పత్రాలు, భవన నిర్మాణ అనుమతులు, వివాహ సర్టిఫికెట్లు, వృత్తి, వ్యాపార లైసెన్సుల జారీ, ట్యాక్స్, నాన్ ట్యాక్స్ చెల్లింపులు, మ్యుటేషన్ సేవలు ఆన్‌లైన్‌లో అందిస్తున్నారు. ఉపాధి హామీ కూలీలకు జాబ్ కార్డుల జారీ, వేతనాల చెల్లింపులు, మస్టర్ నమోదు, తాగునీరు, శానిటేషన్, ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ, గ్రామసభలో చర్చించే ఎజెండా అంశాలు, సంక్షేమ పథకాల అమలు, నిర్ణయ్ యాప్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తారు. గ్రామాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సలహాలను 'మేరీ' యాప్‌లో స్వీకరిస్తారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 100 శాతం ఆస్తి పన్ను వసూలైన గ్రామపంచాయతీగా శివారెడ్డిగూడెం రికార్డుకెక్కింది. గడువు కంటే ముందుగానే గ్రామస్తులు పన్నులు చెల్లించారు.

### ధాన్యం ఉత్పత్తిలో అగ్రస్థానం

ధాన్యం ఉత్పత్తిలో శివారెడ్డిగూడెం పది సంవత్సరాల నుంచి జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచింది. 2023లో ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ అవార్డు దక్కించుకుంది. మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ఏ సమస్య రాకుండా విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. దాంతోపాటు పలు అవార్డులు దక్కాయి.



ఇంటింటికి చెత్తను సేకరిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది



వీధులను శుభ్రం చేస్తున్న సిబ్బంది

### జాతీయ స్థాయికి ఎంపికవుతాం



గ్రామపంచాయతీలో ఆన్‌లైన్ ద్వారా పౌర సేవలు అందించడంపై శివారెడ్డిగూడెం గ్రామపంచాయతీ ర్యాంకింగ్‌లో అగ్రస్థానంలో నిలువడంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. అధికారుల పరిశీలన, స్క్రూట్నీ తర్వాత జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్ సేవలను వీడియోగ్రఫీ కూడా చేశాం. చాలా బాగుంది. జాతీయ స్థాయికి వెళ్తామని నమ్మకం నాకుంది.

**- గూడూరు రజిత, పంచాయతీ కార్యదర్శి, శివారెడ్డిగూడెం**

### రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచింది



ఆన్‌లైన్ ద్వారా పౌర సేవలు అందించడంలో శివారెడ్డిగూడెం గ్రామపంచాయతీ రాష్ట్రస్థాయిలో ఆదర్శంగా నిలిచింది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, వివాహ సర్టిఫికెట్లు, లైసెన్సులు, భవన నిర్మాణ అనుమతులు, పన్నుల చెల్లింపు ఆన్‌లైన్ ద్వారా చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రజలకు చేరువలో సత్వర సేవలు అందిస్తున్నారు. గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రతతోపాటు సేంద్రియ ఎరువులు వినియోగిస్తున్నారు. పచ్చని పైర్లతో గ్రామం కళకళలాడుతుంది.

**- రాపర్తి భాస్కర్‌గౌడ్, ఎంపీడీఓ, భూదాన్ పోచంపల్లి మండలం**



మోత్కూరు మండలంలోని దాచారంలో ధర్మేందర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

## పిచ్చమ్మకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నివాళి

మోత్కూరు, ఏప్రిల్ 6 : మండలంలోని దాచారానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నేవూరి ధర్మేందర్‌రెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ ఇటీవల మృతిచెందగా ఆదివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి పిచ్చమ్మ పార్థీవదేహంపై పూల మాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్, పట్టణాధ్యక్షుడు జంగ శ్రీను, అడ్డగూడూరు మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, తిరుమలగిరి మండలాధ్యక్షుడు సంకేపల్లి రఘునందన్‌రెడ్డి, నార్మాక్స్ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీల మాజీ చైర్మన్లు కొణతం యారూబ్‌రెడ్డి, చిప్పలపల్లి మహేందర్‌నాథ్, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రచ్చ కల్పన, కే సతీశ్, గ్రామ శాఖ అధ్యక్షుడు కడమంచి వస్తాద్, మాజీ సర్పంచులు అండెం రజితారాజిరెడ్డి, దండెబోయిన మల్లేశ్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు పగడాల సతీశ్, నాయకులు సాదుల నర్సయ్య, మర్రి అనిల్‌కుమార్, గజ్జి మల్లేశ్, దాసరి తిరమలేశ్, దొండ నర్సయ్య, బండ స్వరూప, బొనుగ నరేందర్‌రెడ్డి, పొన్నెబోయిన మత్స్యగిరి ఉన్నారు.




లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

## సన్న బియ్యం పంపిణీ ప్రారంభం

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 6 : దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజా ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం పంపిణీ చేసి చరిత్రలో నిలిచిందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో రేషన్ కార్డుదారులకు ఆదివారం సన్న బియ్యం పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందన్నారు.


## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

• సూర్యాపేట యువతికి తీవ్ర గాయాలు

హసన్‌పర్తి, ఏప్రిల్ 6 : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ దేవేందర్ వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన రామటెంకి ఉదయ్ (18) అనంతసాగర్‌లోని ఎస్సార్ యూనివర్సిటీలో బీటెక్ (ఈఈఈ) చదువుతున్నాడు. ఆదివారం ఉదయం ఇదే కాలేజీలో బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్న తన స్నేహితురాలు, సూర్యాపేటకు చెందిన రాంశెట్టి రజిత (19)తో కలిసి బైక్‌పై వరంగల్‌లోని భద్రకాళి ఆలయానికి బయల్దేరారు. హసన్‌పర్తిలోని నల్లగట్టు గుట్ట వద్ద ఎదురుగా వచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్‌లో ఎంజీఎం దవాఖానకు తరలించారు. అప్పటికే ఉదయ్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. రజితకు చికిత్స అందిస్తున్నారు. మృతుడి తండ్రి శ్రావణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



యాదగిరిగుట్ట : రామలింగేశ్వర స్వామి ఆలయంలో ...



ఆత్మకూర్ (ఎం) : పారుపల్లిలో..,

## వైభవంగా సీతారాముల కల్యాణం

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 6 : శ్రీరామ నవమి వేడుకలను ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.



తుర్కపల్లిలో..



భువనగిరి కలెక్టరేట్ : తాజ్‌పూర్‌లో స్వామివారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

### అభిరుచులకు అనుగుణంగా విద్యనభ్యసించాలి : యాదగిరి




రామన్నపేట, ఏప్రిల్ 6 : అభిరుచులకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత చదువులను అభ్యసించి తల్లిదండ్రులు, చదువు నేర్పిన గురువులకు మంచి పేరును తీసుకు రావాలని కృష్ణవేణి టాలెంట్‌స్కూల్ కరస్పాండెంట్ గంగుల నరేందర్‌రెడ్డి, ప్రిన్స్‌పాల్ యాదగిరి అన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఆదివారం వీడ్కోలు సమావేశం నిర్వహించగా వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్స్‌పాల్ ఎండీ రషీద్, ఉపాధ్యాయులు మురళి, ఐతరాజు శ్రీనివాస్, నరేశ్, సత్తయ్య, ప్రవీణ్, జానకి, పూనమ్, ఉమారాణి, మహాలక్ష్మి, వినోద, కరుణ, మమత, సంధ్య, ఫారియ, విజయలక్ష్మి, చైతన్య, శ్రావణి, శైలజ పాల్గొన్నారు.

### వ్యక్తి ఆత్మహత్య

చౌటుప్పల్, ఏప్రిల్ 6 : అనారోగ్య సమస్యతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి తంగడపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లింగాల రాములు (85) భార్య 2016లో అనారోగ్యంతో మృతి చెందినది. దీంతో రాములు హైదరాబాద్‌లోని మాదన్నపేట వినాయక నగర్‌లో ఉంటున్న కుమారుడు భిక్షపతి వద్ద ఉంటున్నాడు. రాములు గత కొంతకాలంగా తీవ్ర కడునొప్పితో బాధపడుతున్నాడు. ఈ నెల 2న కుమారుడు తిరుపతికి వెళ్లడంతో తండ్రి రాములును చౌటుప్పల్‌లోని సోదరి సర్వసతి ఇంటికి పంపాడు. ఈ క్రమంలో ఈ నెల 4న పింఛన్ తెచ్చుకుంటానని చెప్పి స్వగ్రామానికి వచ్చి తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు సీఐ మన్మథకుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### కబేళాకు తరలిస్తున్న గోవులు పట్టివేత

చౌటుప్పల్, ఏప్రిల్ 6 : అక్రమంగా కబేళాకు తరలిస్తున్న గోవులను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జగ్గంపేట మార్కెట్‌లో 12 గోవులను కొనుగోలు చేసి హైదరాబాద్ బహదూర్‌పూరా కబేళాకు టాటా మినీ వ్యాన్‌లో తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వాహనాలు తనిఖీ చేసి పట్టుకున్నారు. దీంతో తుని గ్రామానికి బంగారు లచ్చన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.



నేడు ఉప్పలపహాడ్- టి.రేపాక గ్రామాల మధ్య బిక్కేరు వాగులో జలకళ



నేడు ఉప్పలపహాడ్-టి.రేపాక గ్రామాల మధ్య చుక్క నీరు లేక వెలవెలబోతున్న బిక్కేరు వాగు

## బిక్కేరు వాగు నాడు జలకళ .. నేడు వెలవెల

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 6 : మండలంలోని ఉప్పలపహాడ్, టి.రేపాక గ్రామాల మధ్య గల బిక్కేరు వాగు కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ పాలనలో ప్రతి సంవత్సరం నీటి ప్రవాహంతో కళకళలాడింది. దీంతో వ్యవసాయ బావులు, బోర్లల్లో ఊట పెరుగడంతో బిక్కేరు వాగుకు ఇరుపక్కలా ఉన్న వ్యవసాయ భూముల్లో పంటలు బాగా పండడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. నేడు రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో బిక్కేరు వాగులో చుక్క నీరు లేక వెలవెలబోతుంది. భూగర్భ జలాలు అడుగంటిపోయి బావులు, బోర్లు ఎండిపోవడంతో బిక్కేరు వాగుకు ఇరువైపులా ఉన్న వరి పొలాలు ఎండిపోతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

## సివిల్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా పరమేశ్వర్



భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 6 : ఆల్ ఇండియా కన్జ్యూమర్ సివిల్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా మండలానికి చెందిన గాడిపల్లి పరమేశ్వర్ నియామకమయ్యారు. ఈ మేరకు ఫోరమ్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సునీల్ ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ ఆహార పదార్థాల్లో నిత్యం కల్తీ జరుగుతుందని, వినియోగదారులు చైతన్య వంతులు అయినప్పుడే న్యాయం జరుగుతుందన్నారు. వినియోగదారులకు సేవలు అందించేందుకు శాయ శక్తుల కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను నిర్మూలించాలన్నారు.

## కారు బైక్ ఢీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు

వలిగొండ, ఏప్రిల్ 6 : మండలంలోని వర్కట్‌పల్లి గ్రామ పరిధిలో ఆదివారం కారు బైక్ ఢీకొని ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రయాణికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. వర్కట్‌పల్లి గ్రామానికి చెందిన బండి వినయ్‌కుమార్ (30) వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై వెళ్తుండగా సంగెం నుంచి గోకారం గ్రామం వైపునకు వస్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వినయ్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కాగా.. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.